సాక్షి గుంటూరు

శుక్రవారం । 27 । జనవరి । 2023



పులిచింతల నీటి నిల్వ


అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.2760 టీఎంసీలు ఉండగా ప్రాజెక్టు దిగువకు 4,200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 2,416 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాల్వకు 1,179 క్యూసెక్కులు వదిలారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో గణతంత్ర వేడుకలు



గుంటూరు లీగల్: గణతంత్ర వేడుకలు జిల్లా కోర్టు ప్రాంగణంలో గురువారం వైభవంగా జరిగాయి. జిల్లా ప్రధాన న్యాయస్థానం దగ్గర జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పాత బార్ అసోసియేషన్ వద్ద గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలడుగు వెంకటేశ్వర్లు, న్యాయశాఖ ఉద్యోగుల భవనం వద్ద న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాపిరెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు, బార్ అసోసియేషన్ కార్యవర్గం, బార్ కౌన్సిల్ సభ్యులు, జీపీ, ఏపీపీలు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

జస్టిస్ గోపాలకృష్ణారావుకు సన్మానం



గుంటూరు లీగల్: ఒకటో అదనపు జిల్లా జడ్జి వెణుతురుమల్లి గోపాలకృష్ణారావు ఏపీ హైకోర్టుకు అదనపు న్యాయమూర్తిగా నియమితులైన విషయం తెలిసిందే. శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాలులో ఆయన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం గణతంత్ర వేడుకల అనంతరం న్యాయశాఖ ఉద్యోగుల భవనంలో గోపాలకృష్ణారావును జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓగా మోహనరావు

మాతృశాఖకు శ్రీనివాసరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ సీఈఓగా జె.మోహనరావు పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్‌ఏసీ)పై నియమితులయ్యారు. గుంటూరు జిల్లాలో ఎంపీడీఓగా పని చేస్తూ ఇటీవల ఉద్యోగోన్నతిపై గుంటూరు డీఎల్‌డీఓగా పోస్టింగ్ పొందిన మోహనరావును జెడ్పీ డెప్యూటీ సీఈఓగా నియమిస్తూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. డెప్యూటీ సీఈఓగా రెగ్యులర్ ప్రాతిపదికన పోస్టింగ్ పొందిన మోహనరావుకు సీఈఓగా ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు. అలాగే ప్రస్తుతం డెప్యూటీ సీఈఓగా పని చేస్తున్న వి.సుజాతను బదిలీ చేస్తూ ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం జెడ్పీ సీఈఓగా పని చేస్తున్న డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డిని ఆయన మాతృశాఖ అయిన పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పంపించారు.

జెడ్పీలో గణతంత్ర ఉత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా పరిషత్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సురేష్‌కుమార్ గౌరవ అతిథిగా హాజరయ్యారు. సీఈఓ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన జిల్లాస్థాయి వేడుకల్లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా శ్రీనివాసరెడ్డితోపాటు ప్రశంసా పత్రాలు అందుకున్న జెడ్పీ ఉద్యోగులను అభినందించారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,400, గరిష్ట ధర రూ.2,100, మోడల్ ధర రూ.1,700 వరకు పలికింది.



సంక్షేమ రథోత్సవం : కల్యాణమస్తు, పెన్షన్ కానుక, చేయూత పథకాల శకటం ప్రదర్శన



హాయిగా బతకాలనీ : ఆకట్టుకున్న జగనన్న కాలనీ రథం



సేద్యమేవ జయతే : రైతు భరోసా కేంద్రాల పనితీరును వివరిస్తున్న శకటం



పతాక.. సందేశం

సమగ్రాభివృద్ధి.. సగర్వంగా..

- అన్ని రంగాల్లోనూ మున్ముందుకు..
- నవరత్నాలతో ఇంటింటికీ సిరులు
- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడి
- అట్టహాసంగా గణతంత్ర దినోత్సవం

కాంతిపుంజం త్రివర్ణశోభితమై మెరిసినట్టు.. జనుల మోములు మిలామిలా మెరిశాయి. ఇంటింటా సిరులు కురిపించిన నవరత్నాలు పొదిగిన సంక్షేమ వజ్రవైడూర్యాలు నడివీధిలో కవాతు చేసినట్టు.. విజయ శకటాలు సంతోష శంఖం పూరించాయి. గణతంత్ర సంబరాలు అంబరాన్ని తాకినట్టు.. ప్రగతి పతాక గగనాన సగర్వంగా రెపరెపలాడింది. జనగణమన అంటూ జైత్రయాత్ర చేసింది. గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్ గురువారం సరికొత్త శోభతో తళతళలాడింది. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆహూతులను అద్యంతం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: విద్య, వైద్యంతోపాటు అన్ని రంగాల్లోనూ జిల్లా పురోగమిస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పోలీసు పరేడ్‌గ్రౌండ్‌లో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. తొలుత త్రివర్ణ పతాకాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఈసందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కలెక్టర్ ప్రసంగంలో ముఖ్యాంశాలు

- ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, దీనిలోభాగంగా జిల్లాలో కొత్తగా 211 గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వైద్య సిబ్బంది నియామకాలూ పూర్తి చేశామన్నారు. కొత్తగా పీహెచ్‌సీల స్థాపనకూ అనుమతులు మంజూరు చేసినట్టు చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా ఈ ఏడాది రూ.431 కోట్లతో 1.79 లక్షల మందికి శస్త్రచికిత్సలు చేసినట్టు వెల్లడించారు.
- విద్యకూ ప్రభుత్వం పట్టం కడుతోందని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. అమ్మ ఒడి, మనబడి నాడు-నేడు, విద్యాదీవెన, వసతి దీవెన, విద్యాకానుక జగనన్న గోరుముద్ద వంటి వినూత్న పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. గత ఏడాది కొత్తగా 13,916 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు, 1,427 మంది ఉపాధ్యాయులకు రూ.48.93 కోట్లు ఖర్చుచేసి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేసినట్టు వివరించారు.



జెండా వందనం : జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి. చిత్రంలో ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్, జేసీ రాజకుమారి, ఏఎస్పీ సుప్రజ తదితరులు

- కర్షకుల సంక్షేమానికీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని కలెక్టర్ చెప్పారు. వైఎస్సార్ రైతు భరోసా, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ సున్నావడ్డీ, వడ్డీ రాయితీ వంటి పథకాలు అమలు చేస్తున్నట్టు వివరించారు. గత ఏడాది భారీ వర్షాలకు నష్టపోయిన రైతులు 460 మందికి రూ.38 లక్షలు అందించినట్టు వివరించారు. 2022-23లో ఉద్యాన పంటల అభివృద్ధి కోసం రూ.10.49 కోట్లతో ఆర్థిక ప్రణాళిక రూపొందించినట్టు చెప్పారు.
- జిల్లాలో 209 వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 67,678 గృహనిర్మాణాలు చేపట్టినట్టు కలెక్టర్ పేర్కొన్నారు. ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు సబ్సిడీతో రూ.1,208 కోట్లు కేటాయించామని వెల్లడించారు. 13,381 గృహాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు 4,877 పూర్తయ్యాయని వెల్లడించారు.
- ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా జిల్లాలో కొత్తగా 2,139 బియ్యం కార్డులు మంజూరు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.



కనుల వేడుక : ఉత్సవాన్ని తిలకిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టినా, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య

- జిల్లాలోని 102 రైతు భరోసా కేంద్రాల ద్వారా 1,119 మంది రైతుల నుంచి 8,459 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని వివరించారు.
- వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా 2022-23 సంవత్సరానికి ప్రాధాన్య రంగాలకు రూ.16,392 కోట్లు రుణ లక్ష్యంగా నిర్ణయించామని కలెక్టర్ చెప్పారు.
- జిల్లాలో గత ఖరీఫ్‌లో రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు 18.28 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు వెల్లడించారు. రబీలో ఇప్పటి వరకు 75,654 ఎకరాలకు నీరందించామని పేర్కొన్నారు.
- 353 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధి కోసం రూ.428 కోట్లతో ప్రణాళికలు ఆమోదించామని కలెక్టర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 39 పనులు పూర్తి చేశామని, కొత్త భవనాల నిర్మాణాలూ ఊపందుకున్నాయని వివరించారు.



నృత్యనీరాజనం : నృత్య ప్రదర్శనలో బాలలు



సత్కారం : పద్మశ్రీ పొందిన కోట సచ్చిదానందశాస్త్రిని సత్కరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి



సకుటుంబ సమేతంగా : వేడుకలను తిలకిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల నవీకరణతో మంచి రోజులు

- ప్రభుత్వ ముందుచూపుతో పూర్వ వైభవం చూస్తున్నాం
- కార్పొరేట్ విద్యా వ్యవస్థతో ఏం లాభమనేది తల్లిదండ్రులే ఆలోచించుకోవాలి
- గత 30 ఏళ్లలో కార్పొరేట్ వ్యవస్థతో సాధించిందేముంది
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్
- ఘనంగా గుంటూరు మాజేటి గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించడం ద్వారా విద్యావ్యవస్థలో ఆశాజనక పరిణామాలను చూస్తున్నామని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ చెప్పారు. గుంటూరు బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య హైస్కూల్ పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాఠశాల పూర్వ విద్యార్థి జస్టిస్ కృష్ణమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న తీరుతో సర్కారు విద్యావ్యవస్థకు మంచి రోజులు వచ్చాయని చెప్పారు. కార్పొరేట్ విద్యాసంస్థల రాకతో గత 30 ఏళ్లలో విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని, అయితే కార్పొరేట్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్

వ్యవస్థతో విద్యార్థులకు ఎటువంటి లాభం చేకూరిందనే విషయాన్ని తల్లిదండ్రులు పునరాలోచన చేయాలని అన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ రంగంలో ఎంతో పేరు, ప్రఖ్యాతలు గడించిన మంచి విద్యాసంస్థలు కార్పొరేట్ వ్యవస్థతో పోటీ పడలేక కనుమరుగయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ప్రభుత్వ పాఠశాలల వైభవాన్ని చూడాలని మనసారా కోరుకుంటున్నానని పేర్కొన్నారు. గతంలో కళాశాల విద్య తరువాత ఇంజినీరింగ్ చదువులకు కోచింగ్ పొందేవారని, ప్రస్తుతం 8వ తరగతి నుంచే ఐఐటీ కోచింగ్‌ల పేరుతో విద్యార్థులపై కార్పొరేట్ విద్యాసంస్థలు ఒత్తిడి తెస్తున్నాయని చెప్పారు. విద్యావ్యవస్థకు పూర్వ వైభవాన్ని తెచ్చేందుకు పూర్వ విద్యార్థులు తమ వంతు బాధ్యత తీసుకోవాలని సూచించారు. తాను మాజేటి గురవయ్య హైస్కూల్లో 1977-80 మధ్య కాలంలో 8,9,10 తరగతులు చదివానని గుర్తు చేసుకుని, నాడు తనకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయుల పేర్లను చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ, పూర్వ విద్యార్థి సంఘ ప్రతినిధులు ఎంపీడీ భానుప్రసాద్, కె.రామ్‌నాథ్‌బాబు, ఎం.కోదండ రామారావు, న్యాయవాది చుండూరు సుందరరామ శర్మ, మాజేటి ఎంవీఆర్‌కే ముత్యాలు, పాఠశాల కార్యదర్శి మాజేటి వీఎస్ఆర్ ప్రసాద్, హెచ్ఎం శారదా దేవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



● భారత్ కీర్తి మెరుగౌను

గణతంత్ర దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా చిలకలూరిపేట ఏఎంజీ స్కూల్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. ఓ విద్యార్థిని జాతీయ జెండా రంగులతో రూపొందించిన భారీ గౌను ధరించి అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తింది. భారత్ కీర్తి మెరు'గౌనని' నినదించింది.

– చిలకలూరిపేట

బలీయమైన శక్తిగా భారత్

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



ఏఎన్‌యూ(గుంటూరు): ప్రపంచంలోనే బలీయమైన శక్తిగా భారత్ ఎదుగుతోందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.రాజశేఖర్ చెప్పారు. నాగార్జున యూనివర్సిటీలో గురువారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. వీసీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అగ్ర రాజ్యాలకు దీటుగా భారత్ ఎదిగేందుకు మన రాజ్యాంగం ఎంతో దోహదం చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్ఫూర్తితో ఏఎన్‌యూలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, గణతంత్ర దినోత్సవ వేడుకల కన్వీనర్ ఆచార్య పి.సిద్ధయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని వివిధ విభాగాలు ప్రదర్శించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కొన్ని విభాగాలకు వీసీ బహుమతులు అందించారు.

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు



ముఖ్యమంత్రి సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రులు రజిని, అంబటి, ఎమ్మెల్సీ రఘురాం, ఎమ్మెల్యే బొల్లా

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 30వ తేదీ వినుకొండ పర్యటన నేపథ్యంలో మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వినుకొండ మున్సిపల్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు మున్సిపల్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సభా ప్రాంగణం, హెలీప్యాడ్, భద్రత ఏర్పాట్లు, ట్రాఫిక్ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు వీలుగా స్థలాన్ని ఎంపిక చేశారు. వెల్లటూరు రోడ్డులోని బొల్లా బ్రహ్మనాయుడు ఎస్టేట్‌లో ముఖ్యమంత్రి సభా ప్రాంగణం ఎంపిక చేసినట్లు తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయాలి..

ఈ సందర్భంగా మీడియాతో మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం సభ వినుకొండలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విజయకీలాద్రిపై గణతంత్ర దినోత్సవం

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి పర్వతంపై గురువారం గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ అహోబిల రామానుజ జీయర్‌స్వామి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆశ్రమంలోని వేద విద్యార్థులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రాఘవాచార్యులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న అహోబిల రామానుజ జీయర్‌స్వామి

గణతంత్ర సంబరం.. సేవకు వందనం

74వ భారత గణతంత్ర వేడుకలు జిల్లాలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. గురువారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర సంబరాలు అంబరాన్నంటాయి. వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటాలు జిల్లా ప్రగతిని తెలియజెప్పాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులను ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

– సాక్షి, నెట్‌వర్క్



కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నగరపాలక కమిషనర్ కీర్తి చేకూరి


కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ


చంద్రశేఖరరావు డీఆర్వో | ప్రభాకరరెడ్డి ఆర్డీఓ, గుంటూరు | హరిహరనాథ్ పీడీ, డీఆర్డీఏ | నిర్మల ఎస్ఈ, ఆర్అండ్‌బీ | జి.శ్రీనివాసరెడ్డి సీఈఓ, జెడ్పీ | ఎన్.వెంకటేశ్వరరావు వ్యవసాయశాఖాధికారి | వెంకట నారాయణ మెప్మా పీడీ | మధుసూదనరావు సోషల్ వెల్ఫేర్ డీడీ | మనోరంజని స్త్రీశిశు సంక్షేమ శాఖ డీడీ | పి.విజయ్‌కుమార్, ఎస్ఈ, ఏపీసీపీడీసీఎల్ | రాజగోపాలరావు ట్రెజరీ శాఖ డీడీ | రిజిస్ట్రార్ శైలజ గుంటూరు జిల్లా | జి.లక్ష్మి (సివిల్ సప్లయ్) జిల్లా మేనేజర్ | డాక్టర్ జి.హనుమంతరావు డీఎంఅండ్‌హెచ్‌ఓ | డాక్టర్ ఎ.జయరామ కృష్ణ ఆర్క్ శ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ | కిరణ్మయి దేవిరెడ్డి యువజనాధికారి | సువార్త ఏడీ


ఏఎస్పీ కె.సుప్రజ (పరిపాలన) | ఏఎస్పీ అనిల్‌కుమార్ (ఎల్అండ్‌ఓ) | ఏఎస్పీ ఎ.శ్రీనివాసరావు (క్రైం) | ఏఎస్పీ కె.కోటేశ్వరరావు (ఏఆర్) | డీఎస్పీ స్రవంతిరాయ్ (తెనాలి) | డీఎస్పీ పోతురాజు (తుళ్ళూరు) | శైలజ డీఈఓ | దుర్గాబాయ్ బీసీ వెల్ఫేర్ డీడీ | శేషశ్రీ సీపీఓ | టి.ప్రేమ కుమారి ఈడీ (ఎస్సీ కార్పొరేషన్) | కేఆర్‌డీ కార్తీక్ నాబార్డ్ ఏజీఎం | పూర్ణచంద్రరావు కలెక్టరేట్ ఏఓ | సిద్ధార్థ డి సెక్షన్ సూపరింటెండెంట్ | ఎండీ గౌస్ కలెక్టర్ సీసీ | అరుణ్ సీసీ టు కలెక్టర్ | సాంబశివరావు వెస్ట్ తహసీల్దార్ | నాగశైలజ ఎస్ఆర్‌ఓ (తాడికొండ)


గుంటూరులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు


జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి

ఉత్సాహంగా ఎస్‌పీఎల్

- రెండవ రోజు మూడు మ్యాచ్‌ల్లో పాల్గొన్న ఆరు జట్లు
- ఆద్యంతం ఉల్లాసంగా టోర్నమెంట్

ప్రత్తిపాడు: సాక్షి ప్రీమియర్ లీగ్ ఉత్సాహంగా జరుగుతోంది. ఔత్సాహిక క్రికెటర్లను ప్రోత్సహించేందుకు సాక్షి మీడియా గ్రూపు సాక్షి క్రికెట్ ప్రీమియర్ లీగ్‌ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో రెండవ రోజు గురువారం జరిగిన మూడు మ్యాచ్‌ల్లో ఆరు జట్లు పాల్గొన్నాయి. ప్రీమియర్ లీగ్‌కు స్పాన్సర్లుగా ఏపీఎండీసీ, వివా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవహరించాయి.

నేటి మ్యాచ్‌లు..
- గుంటూరు ఇంజినీరింగ్ కళాశాల వర్సెస్ మలినేని కళాశాల
- విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వర్సెస్ సెయింట్ మేరిస్ ఇంజినీరింగ్ కళాశాల
- చలపతి ఇనిస్టిట్యూట్ లాం వర్సెస్ విజ్ఞాన్ లారా ఇనిస్టిట్యూట్

సెయింట్ మేరిస్ కళాశాల జట్టు జయకేతనం


గెలుపొందిన సెయింట్ మేరిస్ జట్టు (ఇన్‌సెట్) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా మనోజ్

మొదటి మ్యాచ్ ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సెయింట్ మేరిస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్ మధ్య జరిగింది. ఎస్‌వీఆర్ కళాశాల టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన సెయింట్ మేరిస్ జట్టు 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌వీఆర్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి కేవలం 32 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో సెయింట్ మేరిస్ కళాశాల 68 పరుగుల తేడాతో భారీ విజయం కైవసం చేసుకుంది. ఆరు బంతుల్లో 16 పరుగులు చేసి ఐ మనోజ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

మలినేని జట్టు దూకుడు..


విజేతగా నిలిచిన మలినేని కళాశాల జట్టు (ఇన్‌సెట్) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన షరీఫ్

రెండవ మ్యాచ్‌లో జీవీఆర్ అండ్ ఎస్ ఇంజినీరింగ్ కళాశాల వర్సెస్ మలినేని పెరుమాళ్లు ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య పోటీ జరిగింది. జీవీఆర్ అండ్ ఎస్ కళాశాల టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మలినేని కళాశాల జట్టు 10 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 85 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీఆర్ అండ్ ఎస్ జట్టు 10 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 83 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మలినేని కళాశాల మూడు పరుగుల తేడాతో విజయం సాధించింది. 25 బంతుల్లో 40 పరుగులు చేసిన షరీఫ్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

యూనివర్సల్ కళాశాల జట్టు విజయఢంకా..


విజయానందంలో యూనివర్సల్ జట్టు (ఇన్‌సెట్) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన రవితేజ

మూడవ మ్యాచ్‌లో యూనివర్సల్ కాలేజీ, కిట్స్ కళాశాల మధ్య జరిగింది. కిట్స్ కళాశాల టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన యూనివర్సల్ కళాశాల 9.3 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 72 పరుగులు చేసి తొమ్మిది వికెట్లతో విజయఢంకా మోగించింది. 24 బంతుల్లో 31 పరుగులు చేసిన రవితేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

మురిసిన మువ్వన్నెల జెండా


ప్రథమ బహుమతి సాధించిన శ్రీవేంకటేశ్వర బాలకుటీర్


ద్వితీయ బహుమతి పొందిన సెయింట్ ఇగ్నేషియస్ పాఠశాల


తృతీయ బహుమతితో సెయింట్ లారెన్స్ స్కూల్ విద్యార్థులు


జెండా వందనం చేస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

కొరిటెపాడు(గుంటూరు): గణతంత్ర వేడుకలను జీటీ రోడ్డులోని భారత పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించారు. పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు జాతీయ జెండాను ఎగురవేశారు.

జీడీసీఎంఎస్ కార్యాలయంలో..

గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) ఆవరణలో జీడీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మువ్వన్నెల పతాకాన్ని ఆవిష్కరించారు.

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో జాతీయ పతాకాన్ని బ్యాంక్ చైర్మన్ లాలుపురం రాము ఆవిష్కరించారు.

మిర్చి యార్డులో..

గుంటూరు మార్కెట్ యార్డు ఆవరణలో యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

డీఏఓ కార్యాలయంలో..

జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం ఆవరణలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

నల్లపాడు రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో..

లక్ష్మీపురం: గణతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో దేశ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుపుకోవడం గర్వకారణమని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఆర్.నారాయణ అన్నారు. నల్లపాడులోని రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో గణతంత్ర వేడుకలను డీఆర్ఎం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని డీఆర్ఎం నారాయణ ఆవిష్కరించారు. రైల్వే పోలీసులు జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు.

విజ్ఞాన్ యూనివర్సిటీలో..

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో గురువారం భారత 74వ గణతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు 100 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ, ఎన్‌సీసీ పరేడ్ ఎంతగానో ఆకర్షించాయి. యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ అప్పీల్స్ (మంగళగిరి) ఐఏఎస్ ఆఫీసర్ డాక్టర్ పి.లక్ష్మీనరసింహం మాట్లాడుతూ మహనీయుల త్యాగాల వల్లే దేశానికి స్వాతంత్ర్యం సాధ్యమైందని, యువత దేశ నాయకులను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని సూచించారు.

జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో..

నగరంపాలెం(గుంటూరు): జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణం, క్యాంప్ కార్యాలయంలో గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీ చంద్రశేఖర్, ఎస్‌బీ సీఐ నరసింహారావు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన గణతంత్ర సంబరాలు

గుంటూరు వెస్ట్: గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 74వ భారత గణతంత్ర సంబరాలు అంబరాన్నంటాయి. జిల్లా అభివృద్ధిని తెలిపే విధంగా శకటాలు, వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి త్రివర్ణ పతాకం ఆవిష్కరణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్‌రావు జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, శాసన సభ్యులు కిలారి వెంకటరోశయ్య, డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, కృష్ణబలిజ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలాభవాని, మాజీ ఎంపీ శివాజీ పాల్గొన్నారు.

విజేతలు..

సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ స్థానాన్ని శ్రీవెంకటేశ్వర బాలకుటీర్, ద్వితీయ స్థానాన్ని సెంట్‌ఇగ్నేషియస్, తృతీయ స్థానాన్ని సెయింట్‌లారెల్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్ కైవసం చేసుకోగా, యాపిల్ హైస్కూల్ పేరేచర్లకు కన్సోలేషన్ బహుమతి దక్కింది. శకటాల్లో జిల్లా పరిషత్, వ్యవసాయ శాఖ, రవాణా శాఖకు వరుసగా తొలి మూడు స్థానాలు లభించాయి. రెవెన్యూ శాఖకు కన్సోలేషన్ దక్కింది. స్టాల్స్‌లో ఉద్యాన శాఖకు తొలి స్థానం, జిల్లా గ్రామీణ శాఖకు ద్వితీయ స్థానం, పట్టణ పేదరిక నిర్మూలన శాఖకు మూడో స్థానం లభించాయి.